క్లుప్తంగా

మావుళ్లమ్మకు కలెక్టర్ పూజలు



కలెక్టర్ ప్రశాంతికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ధర్మకర్తలు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మవారిని కలెక్టర్ పి. ప్రశాంతి, కుమారుడు, కుమార్తెతో కలిసి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ వేదాశీర్వచనం అందించారు. ఆలయ ధర్మకర్తలు, ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ కలెక్టర్‌కు అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



కల్యాణోత్సవాల్లో భాగంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు : స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో సంకల్పము, గణపతి పూజ, మూర్తి హోమ, ఆవాహన హోమములు, ధ్వజారోహణ, బలిహరణ పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సమయమంతుల రామకృష్ణ, హేమలత దంపతులు హోమం జరిపించారు. బుధవారం సాయింత్రం 6.30 నిమిషాలకు మాణిక్యాంబ అమ్మవారికి, భీమేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అర్చకులు గూడూరి రామ భద్ర శివ కుమార్ శర్మ(నాని) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సీవీ రామన్‌కు ఘన నివాళులు

వీరవాసరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్షేత్ర పాలకుని కల్యాణోత్సవాలు

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పాలకుడు లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి మార్చి ఏడవ తేదీ వరకూ వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పి.సాయి ప్రసాద్, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మేడపాటి చిరంజీవి రెడ్డిలు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం 1న జనార్దన స్వామికి సహస్ర నామార్చనలు, శ్రీదేవి, భూదేవిలకు కుంకుమార్చనలు, అంకురార్పణ, ధ్వజారోహణ, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2న స్వామి కల్యాణ మహోత్సవం, 3న స్వామికి సహస్రనామార్చనలు, 4న హోమాలు, కోలాట భజన, 5న హోమాలు, 6న కుంకుమ పూజలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు తెలిపారు. 7న గ్రామోత్సవం, పుష్ప యాగోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు,.

సిద్ధాంతంలో

సిద్ధాంతంలో విజయ గోపాలస్వామి, మాధవ స్వామివార్ల ఆలయాల్లో కల్యాణమహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. బుధవారం రుక్మిణి, సత్యభామ విజయ గోపాలస్వామిల, శ్రీదేవి, భూదేవి మాధవ స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 7వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బలువు కేదారేశ్వరుడు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేకి సహకరించాలి

పాలకొల్లు అర్బన్: మండలంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న జగనన్న సమగ్ర భూ సర్వేలో భాగంగా డ్రోన్ సహాయంతో నిర్వహిస్తున్న భూ సర్వే ముగిసిందని తహసీల్దార్ కట్టా పూర్ణిమ నాగదేవి చెప్పారు. చింతపర్రులో మంగళవారం డ్రోన్ ప్లేని మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు ప్రారంభించిన సందర్భంగా తహసీల్దార్ నాగదేవి మాట్లాడారు. భూమి దస్తావేజు, పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో లింకైన ఫోన్ నెంబరు, రెండు కలర్ పాస్‌పోర్టు సైజు ఫోటోలు రెవెన్యూ అధికారులకు తక్షణం అందించాలని కోరారు. 60 రోజుల్లో జగనన్న సమగ్ర భూ సర్వే రికార్డులు పరిపూర్ణమవుతాయన్నారు. రైతుల మధ్య చిన్న చిన్న వివాదాలు తలెత్తితే పరిష్కరించడానికి ప్రతి మండలంలోని మెజిస్ట్రీరియల్ అధికారాలు ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రభుత్వం నియమించిందని తహసీల్దార్ తెలిపారు. సర్వేలో ఉప సర్పంచ్ పెన్మెత్స వెంకట రామకృష్ణంరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ రవిరాజు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తనివ్వం

నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు : వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునే విధంగా నగర పంచాయతీ పరిధిలో అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు ఛైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. ఆమె అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటి ఎద్దడిపై సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. స్థానిక 17వ వార్డులో నీటి సమస్య తీవ్రంగా ఉందని, మూడు రోజులుగా కుళాయిల ద్వారా నీరందడంలేదని నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కౌన్సిలర్ జిల్లా పెద్దిరాజు వాపోయారు. శానిటేషన్ కూడా సక్రమంగా లేదని ఫిర్యాదు చేశారు. వార్డులో ఉన్న సమస్యను ఫిట్టర్, వాటర్ వర్క్స్ సిబ్బందితో



పాతపాటి సర్రాజుకు నివాళి అర్పిస్తున్న పంచాయతీ పాలకవర్గం

చర్చించి, చర్యలు తీసుకుంటానని ఛైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. పట్టణంలోని అన్ని మంచినీటి చెరువులను కాల్వలు మూసివేసే సమయానికి పూర్తి స్థాయిలో నింపుతామని ఆమె చెప్పారు. గతేడాది నగర పంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి రాకుండా వేసవిలో అన్ని చర్యలూ తీసుకున్నామని, ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఉందన్నారు. సమస్యల్ని గుర్తించి కుళాయిల ద్వారా నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత అజెండాలోని అంశాలైన గెజిట్ ప్రకారం ఆశీలవసూళ్ల, కబేళా, షాపు అద్దెలు, ఒక రోజు చేపల పట్టుకొనుటకు, పాత పేపర్లు బహిరంగ వేలం వేయుటకు మార్చి 22వ తేదీని నిర్ణయిస్తూ సమావేశం తీర్మానం చేసింది. పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించుటకు 50 బస్తాల బ్లీచింగ్ కొనుగోలుకు తక్కువ కొటేషన్ దారుడు కొనుగోలు చేసే విధంగా సమావేశం ఆమోదం తెలిపింది. తొలుత క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు మృతిపై పాలకవర్గ సభ్యులు సంతాపం తెలిపారు. సమావేశంలో కౌన్సిల్ ఛీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్లు పుప్పాల పుండు, వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు, కమిషనర్ తిరుమలరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్ తనిఖీ

భీమవరం అర్బన్: భీమవరం డివిజన్‌లోని ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్ మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం ఏలూరు జాయింట్ కలెక్టర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి పలు అంశాలపై చర్చించారు. అధికారులకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ వై. రవికుమార్, ఎంపీడీవో రామచంద్ర ప్రభు ఉన్నారు.

దర్జీల దినోత్సవం

ఆకివీడు : దర్జీల దినోత్సవం సందర్భంగా స్థానిక టైలర్లు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. తొలుత పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద దర్జీల పితామహుడు విలియం హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ దర్జీలను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక దర్జీల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా ముఖ్యమంత్రి జగన్ పాలన

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం

సాక్షి, భీమవరం: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో భీమవరం మండలం, వీరవాసరం మండలాలకు చెందిన జగనన్న గృహసారథుల సచివాలయ కన్వీనర్లతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుపరిపాలన అమలవుతోందన్నారు. ఇదే విషయాన్ని పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పడంతో పాటుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా కుట్రలను ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని అన్నారు. గత మూడున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్



జగనన్న గృహసారథుల సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ద్వారా మేలు చేశారనే విషయం ప్రతిపక్షాలకు కూడా తెలుసునని అన్నారు. గ్రామాల్లో, అదే మాదిరిగా నియోజకవర్గ వ్యాప్తంగా మూడున్నరేళ్లుగా చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను పార్టీ శ్రేణులు ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జేఎస్‌సీ కన్వీనర్లు కోమటి రాంబాబు, మానుకొండ ప్రదీప్, ఎంపీపీ పేరిచర్ల విజయనసిరాజు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గూడూరి ఓంకార్ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డీఈఓ ఆర్‌వీ రమణ



ఆకివీడు జెడ్పీ హైస్కూల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: కంప్యూటర్ సైన్స్‌తోపాటు మెకానికల్ ఇంజనీరింగ్‌లోనూ అద్భుతాలు సృష్టించవచ్చని ఐఐటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ రాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సైన్స్‌డే సందర్భంగా ప్రజ్ఞ–23 పేరుతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సందర్భంగా రాజు మాట్లాడారు. నేటి తరం విద్యార్థుల్లో ఎక్కువమంది కంప్యూటర్స్ కోర్సులు గొప్పగా భావిస్తారని ఇంజనీరింగ్ కోర్ గ్రూపులు ఎన్నో కొత్త కొత్త అంశాలను, ఉత్పత్తులను బయటకి తీసుకురావడంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి గ్రూపులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. కళాశాల విద్యార్థులు డి తేజ, జి కృష్ణవంశీ ,శివకృష్ణ, డి చంద్రశేఖర్ సుమారు రూ. 25 వేల వ్యయంతో రూపొందించిన మోటార్ సైకిల్‌ను పరిశీలించి రాజు ప్రశంసించారు. ఎగ్జిబిషన్‌ను భీమవరం పరిసర గ్రామాలకు చెందిన స్కూల్స్ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జగపతిరాజు, సాగి విఠల్‌రంగరాజు, డాక్టర్ కె బ్రహ్మరాజు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు

సాక్షి, భీమవరం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ ఆర్‌వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయన్నారు. ముందుంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్టాళ్లను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీవైఈఓ డి.శ్రీరామ్, ఎం.వీ. కృష్ణారావు, జె.సుధారాణి, వీ.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానం మానవ శ్రేయస్సుకు దోహదపడాలి

ఆకివీడు : ఆధునిక పరిజ్ఞానం మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడాలని, అంతానికి దారి తీయకూడదని స్థానిక పీఎల్ఎస్.జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.విజయ భాస్కర్ అన్నారు. పాఠశాల ఆవరణలో జాతీయ సైన్సు దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మానవ మేథస్సుకు పదును పెట్టే కొలదీ కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు ఉద్భవిస్తాయని జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు పీ.కవిత చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బెల్లం విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

సాక్షి, భీమవరం: బెల్లం విక్రయాల్లో జాగ్రతలు పాటించాలని నాటుసారా తయారు చేసే వ్యక్తులకు బెల్లం విక్రయించవద్దని భీమవరం సెబ్ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. మంగళవారం సెబ్‌స్టేషన్ ఆవరణలో బెల్లం వర్తకులు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా సొంత అవసరాలకు పెద్ద మొత్తంలో బెల్లం విక్రయించాల్సి వస్తే వారి నుంచి సరైన ధ్రువపత్రాల కాపీలు తీసుకోవాలని వర్మ సూచించారు. ఈ సమావేశంలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కృష్ణారావు, ఎ శివప్రసాదరావు, ఉపాధ్యక్షుడు



భీమవరంలో బెల్లం, కిరాణా వ్యాపార సంఘ నాయకులతో మాట్లాడుతున్న వర్మ

ఎస్ చిన వెంకటేశ్వరరావు, కోశాధికారి వై ప్రసాదరావు, కె.యోగయ్య, ఎ రామకృష్ణ పాల్గొన్నారు.

టైలర్ల అసోసియేషన్ భవన నిర్మాణానికి కృషి

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ ప్రగతి పట్టణ టైలర్స్ అసోసియేషన్ భీమవరం వారి ఆధ్వర్యంలో భీమవరం ఎస్.కన్వెన్స్‌లో టైలర్స్ డే, కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ 213 జయంతిని ఘనంగా నిర్వహించారు. టైలర్లు విలియమ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రగతి పట్టణ టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కోపల్లే రామకోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా కామన చినబాబు, ప్రధాన కార్యదర్శిగా కె. త్రినాథ్, సహాయ కార్యదర్శిలుగా యు.సత్యనారాయణ, జె. సూరిబాబు, కోశాధికారిగా పి. కళ్యాణ్, ఉపాధ్యక్షుడిగా ఎం. వెంకట్రావు, ఎం. సత్యనారాయణ, ఆర్. వెంకటేశ్వరరావు, ఎండీ నాషిద్, గౌరవ సలహాదారులుగా ఎస్.సాంబమూర్తి, పి.మధవరావు, విజ చంద్రరావు, బి.రంగరావు, సీహెచ్. వెంకటేశ్వరరావు తదితర 24 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ భవనం నిర్మాణం కోసం అందరం ఐక్యంగా పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టైలర్లు పాల్గొన్నారు.



విలియమ్స్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న టైలర్స్

నేత్రపర్వం.. సోమేశ్వరస్వామి కల్యాణం

కాళ్ల : కాళ్ల గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. దేవస్థానం చైర్మన్ గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులచే వేద పండితుల నడుమ పుల్లేటికుర్తి శేషమణిదీప్ శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మంగళవారం స్వామి అమ్మవార్లకు పుష్పోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కూచంపూడి శ్రీనివాసరాజు తెలిపారు.



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులను నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ హెచ్చరించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ తన కార్యాలయంలో లింగనిర్ధారణచట్టం డివిజన్ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన, ప్రోత్సహించినా నేరమేనన్నారు. ఏదైనా స్కానింగ్ సెంటర్‌లపై గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తే వెంటనే దర్యాప్తు చేపట్టిన నిర్వహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లను కమిటి ఆకస్మికంగా తనిఖీ చేయాలని చెప్పారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఉండి : ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం చెరుకువాడలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో వారు మాట్లాడారు. సమాజంలో మనిషి గౌరవంగా, స్వేచ్ఛగా జీవించాలన్నా తప్పకుండా హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మన హక్కుల్ని మనం తెలుసుకోవడంతో పాటు ఇతరుల స్వేచ్ఛకు భగం కలిగించకుండా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బందెల ప్రమీల, కార్యదర్శి కె.గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సాంబశివరావు

ఆక్వా జోన్ల గుర్తింపుపై వినతి



ఫిషరీస్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నేతలు

సాక్షి, భీమవరం: ఆక్వా జోన్లు గుర్తింపులో కేంద్ర ప్రభుత్వ నిబంధనలు అనుసరించాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అల్లూరి సాయి దుర్గ రాజు డిమాండ్ చేశారు. భీమవరంలో జిల్లా మత్స్యశాఖ అధికారి బి. రాజ్‌కుమార్‌ను మంగళవారం కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ సమస్య తెరమీదకు వచ్చిన నేపథ్యంలో ఈ నిబంధనలు పాటించాలన్నారు. సన్న చిన్న కారు రైతులకు చేపల చెరువులు సాగు చేసుకునేందుకు ప్రోత్సాహకంగా ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. వీటితో పాటు చేపల చెరువులు తవ్వుకునే వారికి ఆర్థిక సహకారం అందించాలన్నారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డ్ ద్వారా వచ్చే పథకాలన్నీ మత్స్యకార రైతులకు వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు పెన్మెత్స సత్యనారాయణ రాజు, మండల అధ్యక్షుడు దండు సోమరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమాని వెంకటేశ్వరరావు, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువుకు మరమ్మతులు

పాలకొల్లు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత సరోవర్ పథకంలో పాలకొల్లు మండలంలోని కాపవరం పంచాయతీ మంచినీటి చెరువు మరమ్మతులు చేపట్టారు. దీనికోసం ప్రభుత్వం రూ.2.80లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఉపాధి కూలీలు వారం రోజుల నుంచి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పనులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం 48 మంది ఉపాధి కూలీలు పనులు చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ జె.జయబాబు పనులను పర్యవేక్షించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అంగర దుర్గావెంకటరమణ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో వార్షిక మరమ్మతులు, నూతన 11 కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ మంగళవారం తెలిపారు. గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, లోసరి, బరువానిపేట, తోకతిప్ప, నాగేంద్రపురం, దెయ్యాలతిప్ప, రామాయణపురం, ఎల్‌వీఎన్ పురం, పల్లిపాలెంతో పాటు దిరుసుమర్రు, లోసరి ఇండస్ట్రియల్ లైన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతు భరోసాతో 13,840 మంది రైతులకు లబ్ధి

ఆకివీడు : రైతు భరోసా పథకం మూడో విడద సొమ్ము విడదల చేయడం ద్వారా ఉండి నియోజకవర్గంలోని 13,840 మంది రైతులు లబ్ధి పొందారు. మంగళవారం రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేశారు. ఆకివీడు మండలంలో 2,881 మంది రైతులకు రూ.1,39,16,500, కాళ్ల మండలంలో 2,514 మంది రైతులకు రూ.1,11,51,000, ఉండి మండలంలో 4,075 మంది రైతులకు రూ.1,89,17,500, పాలకోడేరు మండలంలో 4,370 మంది రైతులకు రూ.1,95,72,500 జమ చేశారు. నియోజకవర్గంలోని 909 మంది కౌలు రైతులకు కూడా సొమ్ము జమచేశారు. ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ నమోదు ఆధారంగా రైతులను పారదర్శకంగా గుర్తించి, సాగు దారులందరికీ రైతు భరోసా పథకం అందజేసినట్లు అధికారులు తెలిపారు. మూడున్నర ఏళ్లుగా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులు లబ్ధి పొందుతూ వ్యవసాయాన్ని పండుగగా సాగు చేయడంతో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటున్నాయని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆర్డీవో సమీక్ష

భీమవరం (ప్రకాశం చౌక్): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భీమవరం డివిజన్లోని ఎంపీడీవోలతో భీమవరం ఆర్డీవో దాసిరాజు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్‌పై ఆయన ఎంపీడీవోలకు పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని ఎంపీడీవోలు పాల్గొన్నారు

ఏఐఎఫ్‌బీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కృష్ణమూర్తి

సాక్షి, భీమవరం: ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా భీమవరానికి చెందిన లంక కృష్ణమూర్తి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 23 నుంచి నాలుగురోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ మహా సభల్లో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కృష్ణమూర్తిని ఎంపిక చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

వీరవాసరం: బాల్యవివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ జ్యోతి తెలిపారు. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. బాలిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కాయల వీరాస్వామి, చింతపల్లి పార్వతి, మేరీ ,రోజా, ప్రసన్న, అన్నపూర్ణ పాల్గొన్నారు.